క్లుప్తంగా

భక్తులకు బ్యాగు అప్పగింత



భక్తులకు బ్యాగు అందిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య

మహానంది: కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్‌కు చెందిన లక్ష్మి, సవిత కుటుంబ సభ్యులతో మహానందికి వచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి వెళ్లే సమయంలో వారి బ్యాగును శనివారం కోనేటి వద్ద మర్చిపోయారు. గుర్తించిన భక్తులు హోంగార్డు కోటయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ద్వారా సీసీ కెమెరాలు పరిశీలించి భక్తులను గుర్తించి వారికి అందజేశారు. బ్యాగులో రూ.5 వేల నగదు, విలువైన కార్డులు ఉన్నట్లు భక్తులు తెలిపారు. ఆలయ సిబ్బందికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

నందికొట్కూరు: ఉపాధి బిల్లులు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నాగేశ్వరరావు కోరారు. శనివారం మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రెండు నెలల నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలీలకు వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాలకృష్ణ, ఉపాధి కూలీలు రామలక్ష్మమ్మ, లలితమ్మ, సావిత్రి, మహానంది, స్వర్ణలత పాల్గొన్నారు.

నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులతో వైద్యులు

నందికొట్కూరు: నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని మిడుతూరు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ తిరుపతి సూచించారు. శనివారం మిడుతూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నేషనల్ ఓరల్ హెల్త్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నోటి ప్రాముఖ్యత, దంతాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నోటిని, దంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సలీంబాషా, నర్సింగ్ ఆఫీసర్ మూర్తుజావలి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



గువ్వలకుంట్ల గ్రామంలో పశువుకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

కొత్తపల్లి: గ్రామాల్లోని పశువులు కలిగిన యజమానులు తప్పకుండా వాటికి టీకాలు వేయించాలని కొత్తపల్లి, దుద్యాల సెక్టార్ల పశువైద్యాధికారులు భువనేశ్వరి, అశోక్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో పశువైద్యసిబ్బందితో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామపంచాయతీలలో గేదెలు, ఆవులు, ఎద్దులు కలిపి మొత్తం 13,950 ఉన్నాయన్నారు. అందులో 10,656 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు అంజి, శారా పాల్గొన్నారు.

'ఉపాధి'లో బదిలీలు

నంద్యాల(అర్బన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నంద్యాల జిల్లా పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది సర్వీసును బట్టి బదిలీల ప్రక్రియ నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బదిలీల్లో కోర్సు డైరెక్టర్లు–ముగ్గురు, ఏపీఓలు–23, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు –19, టెక్నికల్ అసిస్టెంట్లు–76, కంప్యూటర్ ఆపరేటర్లు–43, బీఎఫ్‌టీలు 18, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ ఒకరిని కేడర్ల వారీగా సర్వీసును బట్టి బదిలీలు పకడ్బందీగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ వెంకటసుబ్బయ్య, సూపరింటెండెంట్ వహాబ్, హెచ్‌ఆర్ స్వరూపారాణి పాల్గొన్నారు.

యజ్ఞంలా అన్నదానం

- నల్లమలలో రెండు దశాబ్దాలుగా అన్నదాన వితరణ
- మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్ట్ సేవలు అపారం
- నాగలూటిలో అన్నదాన శిబిరం ప్రారంభం



ట్రస్ట్ అన్నదాన శిబిరం ఏర్పాట్లు

ఆత్మకూరురూరల్: అడవి తల్లి పరవశించేలా.. భక్తుల కడుపు నిండేలా నల్లమలలో యజ్ఞంలా అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. శ్రీశైల క్షేత్రంలో జరిగే ఉగాది ఉత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక నుంచి వందల కి.మీ దూరం కాలినడకన కన్నడిగులు, మహారాష్ట్రీయులు తరలివస్తారు. వీరి సౌకర్యార్థం నల్లమలలో మహారాష్ట్రలోని కొల్హాపురి జిల్లాలోని ఇచ్చలకరంజికి చెందిన శ్రీ శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్ట్ 20 ఏళ్లుగా అన్నదాన శిబిరం నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని నాగలూటి వీరభద్రాలయం వద్ద తమ అన్నదాన వితరణ కొనసాగిస్తోంది. శ్రీ భ్రమరాంబికను తమ ఇంటి ఆడపడుచుగా కన్నడిగులు భావిస్తారు. ఆమెకు పుట్టింటి పసుపు కుంకుమ ఇవ్వడం కోసం సుదూర పాదయాత్ర చేసి ఉగాది బ్రహ్మోత్సవాలకు వారు శ్రీశైలం చేరుకుంటారు. సాధారణంగా భక్తకోటికి దారి పొడవునా దాతలు అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అయితే వెంకటాపురం నుంచి శ్రీశైలానికి దట్టమైన అటవీ మార్గంలో పాదయాత్ర కొనసాగుతోంది. వారు నడిచే దారిలో కఠోరమైన నల్లమల కీకారణ్యం, పర్వత శ్రేణులను అధిగమించాలి. ఈ మార్గంలో అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేయడమంటే అంత తేలికైనా విషయం కాదు. ఇలాంటి మార్గంలో అన్నదాన శిబిరాన్ని నిర్వహించేందుకు ఏటా మహారాష్ట్ర నుంచి దండు తరలివస్తోంది. శ్రీ శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్ట్ భారీ లారీల్లో సరుకు, సరంజామాతో వచ్చేసి అన్నదాతన వితరణ ప్రారంభించింది. లక్షలాది మంది భక్తులకు అటవీ మార్గంలో దాదాపు 20 ఏళ్లుగా ట్రస్ట్ సభ్యులు భోజన సౌకర్యం కల్పిస్తోంది. 250 మంది స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ అన్నదాన యజ్ఞంలో సుమారు 7 లక్షల మందికి చక్కటి ఆహారం లభిస్తోంది.



పసందైన పాయసం తయారీలో స్వచ్ఛంద సేవకులు



రొట్టెల తయారీలో మహిళలు



అన్నదానానికి కొరతలేని సరుకుల నిల్వ

అన్నదానం పుణ్యకార్యం



శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబాదేవి స్వామి అమ్మవార్ల అపార కరుణ పొందేందుకు వారి భక్తులకు ఏటా శ్రీ శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. కన్నడిగుల కులదైవం అయిన నాగలూటి వీరభద్ర స్వామి పాద సన్నిధిలో అన్నదానం పుణ్యకార్యంగా భావిస్తున్నాం.

– ఎంఎస్ పాటిల్ , ట్రస్ట్ చైర్మన్

ఎంతో సంతృప్తిగా ఉంది



వందల కి.మీ నడిచి వచ్చే స్వామి వారి భక్తులకు ఆకలి తీర్చేందుకు మేం చేపట్టిన ఈ కార్యక్రమం మాకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇస్తోంది. పర్యావరణానికి ఏమాత్రం హానీ కలుగకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నాం. ట్రస్ట్ సభ్యులందరం స్వచ్ఛందంగా తరలివచ్చి సేవలు అందిస్తున్నాం.

– బాలసా పాటిల్, ట్రస్ట్ సభ్యులు

ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీఓ కోటేశ్వరమ్మ

పగిడ్యాల: స్థానిక వెలుగు కార్యాలయంలో మూడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న పోషణ్‌బీ – పఢాయ్‌బీ శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. చివరిరోజు సీడీపీఓ కోటేశ్వరమ్మ 3 ఏళ్ల వయస్సు పిల్లల్లో ఎదుగదల లోపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. 3 నుంచి 6 ఏళ్ల వయస్సు పిల్లలకు ప్రాథమిక విద్యను ఎలా అందించాలో వివరించారు. దివ్యాంగుల పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండి వారి ఉన్నతికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యంగా ఉన్న పిల్లలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తూ అంగన్‌వాడీ సెంటర్లను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా గుర్తింపు తేవడం కార్యకర్తల చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ పాల్గొన్నారు.

24న తర్తూరు జాతర సమీక్షా సమావేశం

జూపాడుబంగ్లా: ఉమ్మడి రాష్ట్రాల్లో పేరొందిన తర్తూరు లక్ష్మీరంగనాథస్వామివారి జాతర నిర్వహణపై ఈనెల 24న వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాతరలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించనున్న ఈ సమావేశానికి సర్పంచ్‌తోపాటు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదు

- వయోజన విద్యా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వయోజన విద్యా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

పగిడ్యాల: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని వయోజన విద్యా(ఉల్లాస్) అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఉల్లాస్ వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపూర్ణ అక్షరాస్యత సాధనలో భాగంగా పొదుపు మహిళలకు చదవడం, రాయడం, అక్షరాలు గుర్తించడం కోసం ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వయోజనులైన మహిళలకు ఖాళీ సమయంలో గ్రామంలోనే వలంటీర్ల చేత చదువు నేర్పించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మండల వ్యాప్తంగా 10 గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోందని, ఎంతో మంది మహిళలు అక్షరాస్యులుగా మారుతుండడం అభినందనీయమన్నారు. వీరందరూ ఆదివారం ఎన్ఐఎస్ పరీక్షకు హాజరయ్యేలా వలంటీర్లు చొరవ తీసుకోవాలన్నారు. చదవడం, రాయడం, గణితం విభాగాల్లో ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. 17 మార్కులు తెచ్చుకుంటే చాలన్నారు. అలాంటి వారికి ధ్రువపత్రం ఇస్తామన్నారు. ధ్రువపత్రం భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రకళ, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: వ్యవసాయ పరికరాల కోసం రైతుసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన వ్యవసాయ కార్యాలయంలో రైతుసేవా కేంద్రం సిబ్బందితో సమావేశమయ్యారు. ట్రాక్టర్ పనిముట్లు, బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్ 50 శాతం సబ్సిడీపై అందజేయడానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు.

గాజులపల్లెలో మోస్తరు వర్షం

మహానంది: మండల పరిధిలోని గాజులపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం మోస్తరుగా వర్షం కురిసింది. చాలా రోజుల తర్వాత, ఎండలు తీవ్రమవుతున్న సమయంలో వర్షం పడటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

రైతులకు భూ అనుభవ విస్తీర్ణం వివరాలు తెలియజేయాలి

- జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజు



సమగ్రభూసర్వే రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

జూపాడుబంగ్లా: భూసర్వే చేసిన వెంటనే అక్కడికక్కడే రైతులకు వారి భూ అనుభవ విస్తీర్ణం వివరాలు తెలియజేయాలని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంటు డైరెక్టర్ జయరాజు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కృష్ణకుమార్ తెలిపారు. 80బన్నూరులో జరుగుతున్న సమగ్ర భూ సర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులను శనివారం వారు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సలహాలు, సూచనలిచ్చారు. సర్వే చేయడానికి వెళ్లే టీం సభ్యులు తప్పనిసరిగా ఫీల్డ్ మ్యాప్, గ్రామ అడంగల్, 22ఏ1 రిజిష్టర్, ఐజీఆర్ఎస్ నిషేధిత భూముల జాబితాను తీసుకెళ్లాలని సూచించారు. భూసర్వే చేయడానికి వారం రోజులు ముందుగానే కమ్యూనికేషన్ టీం సభ్యులు సర్వే చేయాల్సిన భూముల రైతులకు నోటీసులివ్వాలన్నారు. నోటీసులు అందుకున్న రైతులు వారి వద్ద భూరికార్డులు తీసుకొని భూమిని సర్వే చేయించుకోవాలన్నారు. రైతుల సమక్షంలోనే భూములను సర్వే చేయాలని సూచించారు. సర్వే అనంతరం భూవిస్తీర్ణం వివరాలు తెలియజేయాలన్నారు. ఎక్కువ, తక్కువ ఏమైనా ఉంటే రైతుల రికార్డులను పరిశీలించాలన్నారు. విస్తీర్ణంలో తేడాలేమైన వచ్చినట్లయితే అందుకు రైతులు అంగీకరించకపోతే మొబైల్ మెజిస్ట్రేట్‌కు అప్పీలు చేసుకోవాలని తెలియజేయాలన్నారు. ప్రతి రోజూ ఐదు సర్వేబృందాలు 25 ఎకరాలకు తగ్గకుండా భూములు రీసర్వే చేయాలని ఆదేశించారు. రస్తా, పంట కాల్వలు, చెరువులు, బావులు, బోర్లు గుర్తించి పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వీరి వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, మండల సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అండర్‌పాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో అండర్‌పాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహానాయక్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట గ్రామ ప్రజలు, రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసి, ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కరివేన గ్రామంలో ఎన్‌హెచ్340సీ, కర్నూలు–గుంటూరు హైవేలో కరివేన గ్రామ ప్రజలు, రైతులు హైవే దాటడానికి అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా హైవే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్ షెల్టర్‌తోపాటు కరివేన నుంచి భానుముక్కల, కొత్త రామాపురం గ్రామాలకు వెళ్లేందుకు అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు మాబాషా, నాయకులు సి.వెంకటేశ్వర్లు, సీఐటీయూ కార్యదర్శి రామ్‌నాయక్, గ్రామ రైతులు, ప్రజలు పెద్దనాగన్న, గోపాల్, అంజి, శేఖర్, రవీంద్ర, సాములు, నరసింహా, బాలకృష్ణ, నాగరాజు, వెంకటసుబ్బయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అహోబిలం పీఠాధిపతికి తిరుమలలో సత్కారం



తిరుమలలో అహోబిలం పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న అధికారులు, అర్చకులు

ఆళ్లగడ్డ : అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప శ్రీరంగరాజ యతీంద్ర మహాదేశికులను తిరుమల తిరుపతి దేవస్థానం శనివారం సత్కరించింది. సాంప్రదాయ మంగళశాసనం కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్దకు చేరుకున్న పీఠాధిపతికి తిరుమల ఆలయ సంప్రదాయం ప్రకారం కార్యనిర్వహణాధికారి సమక్షంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మహాద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి ఆచార్యుల సమక్షంలో స్వామివారిని దర్శించుకుని మంగళశాసనం చేయడం జరిగింది. అనంతరం టీటీడీ అధికారులు ఛత్ర చామర గజ తురగాది సమస్త రాజోపచారములతో తిరుమలలోని అహోబిలం మఠానికి తీసుకువచ్చారు. అహోబిలం మఠం వద్ద టీటీడీ ఈఓ అశోక్ సింఘాల్, జేఈఓ శ్రీనివాసరాజు పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు.

హాస్టల్ వార్డెన్‌పై పోక్సో కేసు

బొమ్మలసత్రం: పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఓ ప్రైవేట్ పాఠశాలలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఎన్‌జీవోస్ కాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఓ యువకుడు హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. పొన్నాపురం కాలనీకి చెందిన ఓ మహిళ అదే పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తుంది. మహిళ మనుమరాలు 9వ తరగతి చదువు ఇటీవల చదువు మానేసింది. ఖాళీగా ఉండటంతో సదరు మహిళ వెంట బాలిక కూడా పాఠశాలకు వెళ్తోంది. అక్కడ ఆ యువకుడు బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం బాలికకు మాయమాటలు చెప్పి తిరుపతికి తీసుకెళ్లి అక్కడ పలుమార్లు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుకున్న మహిళ నంద్యాల తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

- ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్



జూపాడుబంగ్లా: పెడదారిపట్టి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. శనివారం ఆయన జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని బాగా చదువుకుని యువత ప్రయోజకులు కావాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసమే వేచి చూస్తూ కాలం వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి రంగాలు, ప్రైవేటు ఉద్యోగాల్లో రాణించాలన్నారు. అనంతరం జూపాడుబంగ్లా జగనన్న కాలనీకి చెందిన బాలికను నమ్మించి మోసగించిన భాస్కరాపురం గ్రామానికి చెందిన రేణుమాను ప్రశాంత్‌ను డీఎస్పీ అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

వన్యప్రాణుల దాహం తీర్చేందుకు చర్యలు

రుద్రవరం: నల్లమల అటవీ సంరక్షణతో పాటు వన్యప్రాణుల దాహం తీర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు పెద్దకంబలూరు సెక్షన్ అధికారి కిషోర్ తెలిపారు. పెద్దకంబలూరు బీట్ అటవీ ప్రాంతంలో ఉన్న సాసర్ పిట్లను శనివారం నీటితో నింపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో అడవిలో నీటి నిల్వలు లేకుండా పోయాయన్నారు. దీంతో అడవిలో ఉండే జంతువులు దాహంతో అలమటిస్తాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో చెలిమ రేంజి అధికారి ఉదయ్‌దీప్ ఆధ్వర్యంలో అడవి జంతువుల దాహం తీర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముందుగా పెద్దకంబలూరు బీట్‌లో ఎఫ్‌బీఓ రామారావు దగ్గరుండి ట్యాంకర్ నీరు తీసుకెళ్లి అడవిలోని సాసర్ పిట్లను నింపినట్లు ఆయన తెలిపారు. వర్షాలు కురిసే వరకు సాసర్ పిట్లలో నీరు నింపుతూనే ఉంటామని తెలిపారు.

ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

పాములపాడులో ఎస్ఐ సురేష్‌బాబు ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ముస్లింలతో కలిసి మగరీబ్ నమాజులో పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం తానే స్వయంగా భోజనం వడ్డించారు. ముస్లింలు రంజాన్‌ను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని తెలుపుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి జరగలేదు

- డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్ల కాల్వ గ్రామంలో వృద్ధురాలిపై ఎలాంటి లైంగిక దాడి జరగలేదని తమ విచారణల తేలిందని డీఎస్పి రామాంజినాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విష్ణు అలియాస్ పండు ఈనెల 21న తాగిన మైకంలో వృద్ధురాలిపై భౌతిక దాడి చేసి గొంతునులిమి నేలపై పడేశాడన్నారు. దాడిలో ఆమెకు స్వల్ప గాయాలైనట్లు విచారణలో తేలిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు విష్ణును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐ నారాయణ రెడ్డి ఉన్నారు.

భక్తుల సేవలో..



భక్తుల కాళ్లకు మర్దన చేస్తున్న జీవన్‌జ్యోతి ఒకేషనల్ సిస్టర్ స్వరూపరాణి, విద్యార్థులు

శ్రీశైల భ్రమరాంబికను కన్నడ ప్రాంత వాసులు తమ ఆడపడుచుగా భావిస్తారు. ఉగాది పండుగకు అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి, రాయచూరుతో పాటు పలు ప్రాంతాల నుంచి వేలాది కన్నడ భక్తులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. మండుటెండల్లో కాలినడకన వెళ్తున్న భక్తులకు నందికొట్కూరు సమీపంలోని జమ్మిచెట్టు వద్ద ఇండియన్ నేషన ట్రస్ట్ హార్టికల్చర్, హెరిటేజ్ జిల్లా కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, మన ఊరు మన గుడి మన బాధ్యత అధ్యక్షులు రఘువీర్ ఆధ్వర్యంలో పోలూరు జీవన్‌జ్యోతి ఒకేషనల్ జూనియర్ కళాశాల సిస్టర్ స్వరూపరాణి, విద్యార్థులు వైద్య సేవలు అందిస్తున్నారు. భక్తుల కాళ్లకు కేరళ ఆయిల్‌తో మర్దన చేసి పంపుతున్నారు.

– నందికొట్కూరు

రైతుల భూములు లాక్కోవద్దు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

బండి ఆత్మకూరు: రైతులకు జీవనాధారమైన భూములను విద్యుత్ కేంద్రం ఏర్పాటు పేరుతో లాక్కోవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, సీనియర్ నాయకులు రామచంద్రుడు, మండల కార్యదర్శి రత్నమయ్య రైతు సంఘం నాయకులు తలారి రామచంద్రుడు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన విద్యుత్ కేంద్రానికి, పేదల భూములను సర్వే చేయడాన్ని నిరసిస్తూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల జీవనాధారమైన భూములను విద్యుత్ కేంద్రం పేరుతో, సర్వే చేసి బలవంతంగా లాక్కోవడం అన్యాయమన్నారు. ఈర్నపాడు గ్రామంలో 1984లో ఏర్పడిన జాయింట్ ఫార్మర్ సొసైటీ కింద పేదలకిచ్చిన 190 ఎకరాల భూమిని, సర్వే నెం.542లోని 25 ఎకరాల 25 సెంట్లు భూమిని 40 ఏళ్ల నుంచి అనుభవంలో ఉన్న పేదలకు ఇంతవరకు పట్టాపాస్ బుక్కులు ఇవ్వలేదని, ఇప్పటికైనా వారికి పాస్ బుక్‌లు ఇచ్చి, ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి మూల్యాంకనం కేంద్రంలో వసతులు కల్పించాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 60 సంవత్సరాలు పైబడిన వారికి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య కోరారు. ఈమేరకు శనివారం డీఈఓ జనార్ధన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రంలో వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. మూల్యాంకనానికి సంబంధించిన స్పెషల్ అసిస్టెంట్ వారికి డ్యూటీ వేయాలన్నారు. భోజన వసతి, కూల్ వాటర్ కల్పించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో పాల్గొన్న చీఫ్ డిపార్టుమెంటల్, ఇన్విజిలేటర్స్‌కు రెమ్యునరేషన్ వెంటనే మంజూరు చేయాలన్నారు. స్పాట్ ముగిసిన వెంటనే సిబ్బందికి రెమ్యునరేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు జాకీర్‌హుసేన్, కన్నయ్య, హుసేన్‌మియా పాల్గొన్నారు. అలాగే.. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్, కార్యదర్శి అరవింద్ డీఈఓకు వినతి పత్రం అందజేశారు.